ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర శక్తిమంతం

కాప్రా, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యంలో మీడియాపాత్ర శక్తివంతమైనదని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ హోమీజే బాబా ఫంక్షన్‌హాలులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యంలో ఎన్నికలు-ఓటు హక్కు ' అంశంపై సదస్సు, 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు నైతిక విలువలు పాటిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో తమవంతు పాత్రను నిర్వహించినపుడే ప్రజాస్వామ్య ఫలితాలు సిద్ధిస్తాయన్నారు. రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కీలకమైన పాత్ర పోషిస్తుందని, మీడియాలో పెను మార్పులు జరిగే అవకాశం ఉందని, 2024 ఎన్నికల్లో దీని ప్రభావం బాగా ఉంటుందని తెలిపారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టీయూడబ్ల్యూజే 2024 డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ఎన్నికల నిఘావేదిక కన్వీనర్ వి.వి.రావు , రాష్ట్ర టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ, మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రామ్‌రెడ్డి , కార్యవర్గ సభ్యులు మోతె వెంకట్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు రవీందర్‌రెడ్డి, జిల్లా జర్నలిస్టు సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బుద్వేల్ లే అవుట్ ఓఆర్ఆర్‌కు అనుసంధానం

రూ. 354 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన ఎస్‌సీసీ నిర్మాణ సంస్థ

సిటీబ్యూరో, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): కోకాపేట నియోపోలిస్ లే అవుట్ తరహాలో బుద్వేల్ లే అవుట్‌ను అభివృద్ధి చేసే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చర్యలు చేపట్టింది. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఔటర్ రింగు రోడ్డు వెళ్లే మార్గంలో ఉన్న బుద్వేల్ లే అవుట్‌ను సుమారు 182 ఎకరాల్లో హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తోంది. ఈ లే అవుట్‌ను పూర్తిగా బహుళ అంతస్తు భవనాలు (మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్-ఎంఎస్‌బీ) నిర్మించేలా లే అవుట్‌కు డిజైన్ చేశారు. 100, 120 అడుగుల విస్తీర్ణంతో కూడిన రోడ్లను నిర్మించడం ద్వారా 10 - 60 అంతస్తుల వరకు ఆకాశ హర్మ్యాలను నిర్మించేందుకు వీలుగా అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నారు. ఇందుకు రూ.354 కోట్ల అంచనా టెండర్లు పిలిచిన హెచ్ఎండీఏ ఆ ప్రక్రియను ఇటీవలే పూర్తి ఎస్‌సీసీ(నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ) లిమిటెడ్ సంస్థకు నిర్మాణం పనులను అప్పగించింది. గతంలో ఇదే సంస్థ ఐటీ కారిడార్‌లోని కోకాపేట నియో పోలీస్ లే అవుట్‌ను సైతం అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా అభివృద్ధి చేసింది. తాజాగా బుద్వేల్ హెచ్ఎండీఏ లే అవుట్‌ను సైతం అదే స్థాయిలో ఐటీ కంపెనీలు, భారీ నివాస గేటెడ్ కమ్యూనిటీ నివాసాలు ఉండేలా ఎకరాల స్థలాన్ని ప్లాట్లుగా మార్చి ఆన్‌లైన్ వేలంలో విక్రయించారు. మొత్తం 182 ఎకరాలను 17 ప్లాట్లుగా చేసి అందులో 14 ప్లాట్లను మాత్రమే వేలం ద్వారా విక్రయించింది.

బుద్వేల్‌లో 182 ఎకరాల్లో చేపట్టిన హెచ్ఎండీఏ లేఅవుట్ ఔటర్ రింగు రోడ్డును అనుకొని ఉంది. అదే విధంగా అటు ఐటీ కారిడార్ వైపు, ఇటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు వెళ్లేందుకు వీలుగా లేఅవుట్‌లోని ప్రధాన రహదారి ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డుకు అనుసంధానం చేసేలా లేఅవుట్‌ను డిజైన్ చేశారు. ప్రస్తుతం లేఅవుట్‌లోకి వెళ్లేందుకు ప్రధాన రహదారి రాజేంద్రనగర్ నుంచి ఉన్న హిమాయత్‌సాగర్ వరకు రేడియల్ రోడ్డు మీదుగా మానస హిల్స్ పక్క నుంచి రోడ్డు మార్గం ఉంది. భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు వచ్చే అవ

ఔటర్‌తో అనుసంధానం..

కాశం ఉండటంతో దానికి అనుగుణంగా విశాలమైన రోడ్లను అటు ఓఆర్ఆర్ వైపు, ఇటు రాజేంద్రనగర్ - బుద్వేల్ రేడియల్ రోడ్డు వైపు రోడ్లను నిర్మించనున్నారు. రోడ్లతో పాటు మంచినీరు, డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్, ల్యాండ్ స్కేపింగ్ వంటి మౌలిక వసతులను ఈ లే అవుట్‌లో కల్పించనున్నారు. ఈ లే అవుట్ సముద్ర మట్టానికి 550 నుంచి 590 అడుగుల ఎత్తులో ఉంది. అదే విధంగా జంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్‌సాగర్‌కు సమీపంలోనే ఉండటంతో అద్భుతమైన వ్యూ ఈ లే అవుట్ మీదుగా ఉంది. దీంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని హెచ్ఎండీఏ అధికారులు మౌలిక వసతులను కల్పిస్తున్నారు.



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పదేండ్లు మైనార్టీలకు అన్ని విధాలుగా సేవలు

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 2: గత పదేండ్లు మైనార్టీలకు ఉత్తమంగా సేవలందించి, అన్ని విధాలుగా అండగా నిలిచాం అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ జీకే సరస్వతి పంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మాజీ హోం మంత్రి మహమ్మద్ అలీ, మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, ముందుగా మైనార్టీ సోదరీ సోదరమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన పదేండ్లు మైనార్టీలకు అన్ని విధాలుగా సేవలందించామని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికి సెక్యూలర్‌గానే కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా ఉంచామన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో రాబోతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీన ఉపేందర్ రెడ్డి, మేకల సునీత రాము యాదవ్, సబిత అనిల్ కిషోర్, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు జీకే శ్రీదేవి హన్మంతరావు, జగదీష్ గౌడ్, జీకే హన్మంతరావు, బద్దం పరశురాంరెడ్డి, రావుల అంజయ్య, అనిల్ కిషోర్, అమీనుద్దీన్, జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, మధుసూదన్ రెడ్డి, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలకు భరోసా ఏదీ!?

కిషన్ మృతి పట్ల భగ్గుమన్న కార్మిక సంఘాల నేతలు

రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో డిస్పెన్సరీ ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. ఇక్కడికి రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కార్మిక సంఘాల యూనియన్లకు వచ్చే కార్మికులు, సందర్శకులు ఇలా వందలాంది మంది వరకు ప్రధాన కార్యాలయానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రధాన గేటు పక్కన డిస్పెన్సరీని ఏర్పాటు చేయగా, అందులో అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా గడిచిన కొద్ది రోజులుగా డిస్పెన్సరీలో సరైన సౌకర్యాలు లేకపోవడం, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఈ తరుణంలోనే డిస్పెన్సరీకి కూతవేటు దూరంలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంటమాలజీ కార్మికుడు పెండ్యాల కిషన్ పిట్స్‌తో మరణించారు. ఈ ఘటన డిస్పెన్సరీ పనితీరుకు అద్దం పడుతోంది. సదరు కిషన్‌కు డిస్పెన్సరీ ప్రాథమిక చికిత్స కూడా అందించలేని పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు కార్మిక సంఘం నాయకులు హైదరాబాద్ నర్సింగ్ హోంకు తరలించారు. కిషన్‌ను పరిశీలించిన అక్కడి వైద్యులు అప్పటికే అతను మరణించినట్లు ప్రకటించారు. సకాలంలో కిషన్‌కు ప్రైమరీ హెల్త్ డిస్పెన్సరీలో ప్రాథమిక చికిత్స అందుంటే.. బతికే వాడని కార్మికులు చెబుకుంటున్నారు. కాగా, కార్మికుల ఆరోగ్య పరిస్థితులు పట్టించుకోకుండా కర్కశంగా ఎన్నికల విధులు చేయించడంతోనే కార్మికుని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని సంఘాల నేతలు బాహాటంగా విమర్శించారు. కాచిగూడ గోల్నాకలో అర్బన్ మలేరియా స్కీమ్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న పెండ్యాల కిషన్(48) ఎన్నికల విధులు నిర్వహిస్తూ మూర్ఛ వ్యాధితో చనిపోయాడని, మరణించిన కిషన్ కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ప్రధాన కార్యాలయంలో కార్మికుడు మరణిస్తే కనీసం కమిషనర్ వచ్చి శవాన్ని చూడకపోవడం బాధాకరమన్నారు. సదరు కిషన్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆ ఫ్యామిలీకి నష్టపరిహారం చెల్లించాలని యూనియన్ నేతలు వెంకటయ్య, కళ్యాణ్, ఆశోక్, ఉపేందర్‌లు డిమాండ్ చేశారు.

నిందితులను శిక్షించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: ప్రజాయుద్ధ నౌక గద్దర్‌పై కాల్పులు జరిపిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ.. ఈ విషయాన్ని సమాజం ముందు ఉంచేందుకు 'పాటపై తూటా'కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పలువురు తెలిపారు. ఈ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. గద్దర్ ఫౌండేషన్ సభ్యుడు, గద్దర్ కుమారుడు గుమ్మడి సూర్యకిరణ్, ఔటా (సీ) అధ్యక్షుడు డాక్టర్ పరుశురాం మాట్లాడుతూ ఏప్రిల్ 6న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం ఆరు గంటలకు పాటపై తూటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ బాలకోటి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వినీత పాండే తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులకు మినహాయింపు ఇవ్వాలి

విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ అధ్యక్షుడు అబ్దుల్లా

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 2 : రాష్ట్రంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కోసం టెట్ పేపర్-2 ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశ్వర్లకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆర్టీఈ యాక్ట్ 35/2009 ప్రకారం భాషా పండితుల పదోన్నతి కోసం టెట్ నిబంధన వర్తించదనే అంశంతో పాటు అలహాబాద్ హైకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకుని పదోన్నతులకు అవకాశం కల్పించాలన్నారు. దీని కోసం ఎన్‌సీటీఈ అనుమతి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్‌సీఎస్ శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హమిద్‌ఖాన్ ఉన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

కొండాపూర్, ఏప్రిల్ 2 : ఉక్రెయిన్ వైద్య విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ దవాఖానలో నిర్వహించారు. వైద్య విద్యనభ్యసించేందుకు ఉక్రెయిన్ యూనివర్సిటీలకు వెళ్లిన విద్యార్థులు యుద్ధ సమయంలో నియో ఓవర్సీస్ కన్సల్టెన్సీ ద్వారా ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కార్యక్రమంలో నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎండీ, ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖలో భారతీయ ప్రతినిధి డాక్టర్ దివ్యా రాజ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉజ్బెకిస్థాన్ రాయబారి సర్దోర్ ఉస్తంబేవ్‌లతో కలిసి పట్టాలను అందజేశారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, ఏఐజీ దవాఖాన చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం చైర్మన్ విజయబాబు, ఉజ్బెకిస్థాన్ ఎంబసీ ఫస్ట్ సెక్రటరీ ఎస్ సుయరొవ్, కౌన్సెలర్ ఐ సొలియెవ్, నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సీఈఓ డాక్టర్ బీవీకే రాజ్, ఏఐజీ దవాఖాన వైస్ ప్రెసిడెంట్ సందీప్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనలు చేశారు. ఆగాపుర ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారితో కలెక్టర్ మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకాళ, స్ఎంఓ డాక్టర్ ఇస్రార్, డాక్టర్ నాగేంద్రబాబు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

జీహెచ్ఎంసీ ఆర్థిక విభాగం అదనపు కమిషనర్‌గా గీతా రాధిక

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఫైనాన్స్ విభాగానికి అదనపు కమిషనర్‌గా కొనసాగిన జయరాజ్ కెనడీని విధుల నుంచి రిలీవ్ చేస్తూ కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఉత్తర్వులు జారీ చేశారు. పదవీ విరమణ చేసి విధుల్లో కొనసాగుతున్న అధికారులను పంపించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. కెనడీ స్థానంలో అదనపు కమిషనర్ గీతా రాధికను ఫైనాన్స్ విభాగం బాధ్యతలు అప్పగించారు. మరో అదనపు కమిషనర్ శ్రీవాత్సవ కోటకు ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌తో పాటు ఎస్టేట్, హెరిటేజ్ విభాగం బాధ్యతలు అదనంగా అప్పగించారు.

ఎంసీఏ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. మూడేళ్ల ఎంసీఏ, రెండేళ్ల ఎంసీఏ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వర్సిటీ సాధన సమితి ఏర్పాటు

ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీ సాధన సమితి ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ యూనివర్సిటీ సాధన సమితి ఏర్పాటైంది. సమితి కన్వీనర్‌గా ఓయూ విద్యార్థి నాయకులు ఎస్.నాగేశ్వర్ రావు, కో కన్వీనర్‌గా ఎస్.సుమంత్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా ఖమ్మం జిల్లాకు చెందిన ప్రొఫెసర్లు బాధ్యతలు నిర్వర్తిస్తారు. యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే సాధన సమితిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతరం, వారు సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి పదేళ్లు గడుస్తున్నా నేటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వర్సిటీ లేకపోవడం బాధాకరమన్నారు. భౌగోళికంగా, విద్యాపరంగా అనువైన ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన పరిశోధనలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి ఖమ్మం జిల్లాను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆమంచి నాగేశ్వర రావు, సీహెచ్ వంశీధర్, గుమ్మడి అనూరాధ, విద్యార్థి నాయకులు నాగేశ్వరరావు, సుమంత్, రుక్మత్ పాషా, అంజి, సంపత్, మేఘన, సిరి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో పని చేస్తున్నటువంటి సీనియర్ లోకో పైలట్ ఎం.బాలకృష్ణ కొద్ది రోజుల క్రితం ఉప్పల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు (ఏడీఆర్ఎఫ్) ఎస్‌సీఆర్ఈసీఎస్ సికింద్రాబాద్ తరుపున రూ.5,00,000ల (ఐదు లక్షలు) చెక్కును ప్రెసిడెంట్ చిలుకుస్వామి, వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డైరెక్టర్స్, డెలిగేట్స్ పాల్గొనడం జరిగింది.

- మారేడ్‌పల్లి, ఏప్రిల్ 2

కాంగ్రెస్ వచ్చే.. రైతుబీమా.. కల్యాణలక్ష్మి పాయే

రూ.2 లక్షల రుణమాఫీ ఏమాయే? : బీఆర్ఎస్ నాయకురాలు కేతమ్మ

శామీర్‌పేట, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ రాగానే రైతుబీమా పాయే.. కల్యాణలక్ష్మి పాయే.. రూ.2 లక్షల రుణమాఫీ జరగలేదాయే.. అని జవహర్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కేతమ్మ విమర్శించారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తాలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ అన్నారు. ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిండు. ఎంతో ఎత్తులో ఉన్న గోదావరి నీళ్లను తీసుకువచ్చి, భగీరథుడు అయ్యిండు. కేసీఆర్ ప్రభుత్వం పోయిన వంద రోజుల్లోనే పాత రోజులు వస్తున్నాయి. తాగు నీళ్లు, సాగు నీళ్లకు ఇబ్బందులు వస్తున్నాయి. బ్యాంకులలో రూ.2 లక్షల వరకు రుణం తెచ్చుకోండి, డిసెంబర్ 9న మాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. ఇప్పుడు ఒకరికైనా మాఫీ అయిందా..? అని ఆమె ప్రశ్నించారు. కేసీఆర్ ఆడ పిల్ల పెండ్లికి రూ.లక్ష ఇచ్చిండు, పురుడుపోసుకుంటే పౌష్టికాహారం, ప్రభుత్వ దవాఖానలో డెలివరీ చేసి ఆయిల్, అంగి, కుల్లా, చీరతో ఉన్న కేసీఆర్ కిట్ ఇచ్చి ఇంటికి పంపిండు. ఇప్పుడు కాంగ్రెస్ రాగానే అన్ని మాయమైనవి. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న లక్ష్మారెడ్డిని గెలిపించుకునేందుకు కష్టపడుదామని కేతమ్మ విజ్ఞప్తి చేశారు.

జేఎన్టీయూహెచ్ పరీక్షల అదనపు కంట్రోలర్ డాక్టర్ శైలజను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవన్

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

సైదాబాద్, ఏప్రిల్ 2 : విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలిచే ప్రయోగాలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ పరీక్షల అదనపు కంట్రోలర్ డాక్టర్ శైలజ అన్నారు. మంగళవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కాలనీలోని భోజిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం జిజ్ఞాస-2024 ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యలో రాణిస్తూ ముందుకు సాగాలన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ శైలజ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదవన్, కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ సుధ, సీవోవో డాక్టర్ సుజాత గంగాధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసి శైలశ్రీ, ఉప ప్రధానోపాధ్యాయుడు దయాకర్ రెడ్డి, కన్వీనర్ మంజు భార్గవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.